సాక్షి ఒడిశా

బుధవారం । 21 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4,95,410
బంగారం : 1 గ్రాము 450 మిల్లీ గ్రాములు
వెండి : 6 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



నడకతో ఆరోగ్యం

రాయగడలో నడకపై చైతన్య ర్యాలీ జరిగింది. నడకతో ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. - 8లో



అవసరమైతే పార్టీ వీడుతా..

అవసరమైతే కాంగ్రెస్ వీడుతానని మాజీ ఎంపీ జయరాం అన్నారు. ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. - 8లో

ముగిసిన వెలుపలి చందన యాత్ర



చందన యాత్రలో భగవంతుని దర్శనంతో తరించిన భక్త జనం



చందన యాత్రలో దేవుళ్ల ఊరేగింపు



చందన యాత్ర పురస్కరించుకుని నరేంద్ర సరోవరం నడి బొడ్డున చందన వేదిక శోభ

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని చందన యాత్ర తొలి విడత మంగళవారంతో ముగిసింది. అక్షయ తృతీయను పురస్కరించుకుని ఆరంభమైన ఈ యాత్ర నిరవధికంగా 42 రోజులు కొనసాగుతుంది. తొలి 21 రోజులు వెలుపలి చందన యాత్రగా శ్రీ మందిరం నుంచి స్వల్ప దూరంలో నరేంద్ర సరోవరంలో అత్యంత ఆనందోత్సాహాలతో కొనసాగింది. శ్రీ మందిరం నుంచి నరేంద్ర సరోవరం వరకు దారి పొడవునా భక్తులు పలు రీతుల్లో భక్తి భావాల్ని చాటుకున్నారు. కళాకారులు శాస్త్రీయ నృత్య, సంగీత గీతాలాపన తదితర కార్యక్రమాలతో దేవుళ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిత్యం సంధ్య వేళలో పల్లకిలో ఉత్సవ మూర్తులు సరోవరం నడి బొడ్డున ఉన్న చందన వేదికకు చేరుకుని శోభాయమానమైన అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించి నౌకా విహారంతో భక్తుల్ని మురిపించారు. 20వ రోజున అత్యధికంగా 21 సార్లు సరోవరంలో చుట్టు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. చివరి రోజు సంధ్య వేళలో నౌకా విహారం లేకుండా చందన వేదికపై దేవదేవుళ్ల పసుపు పొడి కలిపిన నీటితో ఉత్సాహభరితంగా చందన యాత్రలో పాల్గొన్నారు. వెలుపలి చందన యాత్ర 21వ రోజున శ్రీరామకృష్ణ, మదన మోహన్‌లు పసుపు నీరు పిచికారీ చేసుకుని ఆహ్లాదభరితంగా చందన యాత్రకు తెరదించారు. నేటి నుంచి లోపలి చందన యాత్ర ఆరంభం అవుతుంది. 21 రోజుల పాటు నిరవధికంగా శ్రీ మందిరం లోపలి ప్రాకారంలో చందన యాత్ర కొనసాగుతుంది.



చందన యాత్ర ఊరేగింపులో స్థానిక కళాకారుల ప్రదర్శన



నరేంద్ర సరోవరంలో మదన మోహనుడి చందన యాత్ర నౌకా విహారం

మంత్రులకు అధికారాల పెంపు

- కార్యదర్శుల పెత్తనం కుదింపు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయంతో మంత్రుల అధికారాల పరిధి విస్తరించి కార్యదర్శుల పెత్తనం కుదించుకుపోయింది. రాష్ట్ర శాసన సభ వ్యవహారాల శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంలో మంత్రి మండలి సమావేశాల నిర్వహణలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆమోదంతో ఈ మార్పులు ప్రకటించారు.

తాజా ఉత్తర్వుల ప్రధానాంశాలు

మంత్రి మండలి సమావేశం తేదీని 5 రోజులు ముందుగానే నిర్ణయిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఈ కాలపరిమితిని సడలించవచ్చు. మంత్రి మండలి ప్రతిపాదనలను 3 రోజులు ముందుగానే ఖరారు చేస్తారు. ప్రతిపాదనలు 2 రోజుల ముందుగా అయా మంత్రుల వద్దకు చేరాల్సి ఉంటుంది. మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలకు ముఖ్యమంత్రి ఆమోదం తప్పనిసరి. మంత్రి మండలి సమావేశంలో మంత్రులు మాత్రమే మాట్లాడతారు. అవసరమైతే తప్ప కార్యదర్శులు చొరవ కల్పించుకో కూడదు. వారి అభిప్రాయం అడిగినప్పుడు సముచితంగా చొరవ కల్పించుకోవాలి. సమావేశాల సమయంలో ముఖ్యమంత్రి, క్యాబినెట్ మంత్రులు, చర్చకు సంబంధించిన అజెండా ఉన్న శాఖ ఇన్‌చార్జ్ సహాయ మంత్రులు, క్యాబినెట్ కార్యదర్శి మాత్రమే క్యాబినెట్ గది లోపల కూర్చోవాలి. ఈ చర్చల కోసం ప్రతిపాదనలు ఉన్న శాఖల కార్యదర్శులు అధికారుల కోసం ప్రత్యేకంగా నియమించబడిన ప్రత్యేక గదిలో ఆద్యంతం అందుబాటులో ఉండాలి. అవసరమైన పరిస్థితుల్లో మంత్రి మండలి సహాయం కోసం క్యాబినెట్ గదిలోకి ప్రవేశించవచ్చు. మంత్రివర్గం తీర్మానాల అమలు కార్యకలాపాల్లో ఆయా శాఖల మంత్రులకు సర్వ అధికారాలు కల్పించారు. ఈ సందర్భంలో కూడా కార్యదర్శుల చొరవ అంతంత మాత్రమే.

గవర్నర్ సంతాపం

భువనేశ్వర్: భారత దేశ అణుశక్తి కార్యక్రమంలో ప్రముఖుడు డాక్టర్ ఎంఆర్ శ్రీనివాసన్ మృతిపై రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భారత దేశ ఇంధన భద్రత, శాస్త్రీయ పురోగతికి డాక్టర్ శ్రీనివాసన్ చేసిన అద్భుతమైన కృషి చిరస్మరణీయం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా దివంగత ఎం. ఆర్. శ్రీనివాసన్ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సంతాపం తెలిపారు.

తమిళనాడులో వలస కార్మికుని మృతి



మృతి చెందిన సురేంద్ర

రాయగడ: చదువుకునేందుకు డబ్బులు అవసరం కావడంతో ఇంటి వారి ఆర్థిక పరిస్థితి అంతగా బాగోలేకపోవడంతో గత్యంతరం లేక కూలి పనులకు వెళ్లిన ఒక వలస కార్మికుడు తమిళనాడులో మృతి చెందాడు. మృతుడిని జిల్లాలోని కాసీపూర్ సమితి ఒడాజొరొ పంచాయతీలోని పొడాపొదొరనొ గ్రామానికి చెందిన ఇందిరామాఝి చిన్న కొడుకైన సురేంద్ర మాఝి ((17) గా గుర్తించారు. కొరాపుట్‌లో గల ఒక కళాశాలలో ప్లస్ టూ చదువుతున్న సురేంద్ర కొంత డబ్బులు అవసరం ఉండగా నాలుగు నెలల క్రితం తన గ్రామానికి చెందిన కొందరు యువకులతో తమిళనాడుకు వెళ్లాడు. కొబ్బరి కాయలు తెంపే పనిలో చేరిన సురేంద్ర గత ఆదివారం నాడు కొబ్బరి చెట్టు ఎక్కి కింద పడిపోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని తోటి స్నేహితులు సురేంద్ర కుటుంబానికి తెలియజేశారు. మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబీకులు దహన సంస్కరణ కార్యక్రమాలు పూర్తి చేశారు. గత మార్చి నుంచి ఇప్పటివరకు కాశీపూర్ సమితిలో వలస పనులకు వెళ్లిన వారిలో ముగ్గురు మృతి చెందారు.

నైపుణ్య ఆధారిత అభ్యాసం కీలకం: గవర్నర్



సీయూటీఎం ప్రయోగశాల సందర్శించిన గవర్నరు దంపతులు

భువనేశ్వర్: నైపుణ్య ఆధారిత విద్య కీలమకని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. ఆయన మంగళవారం సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీయూటీఎం)ను సందర్శించారు. ఆయన తోపాటు సతీమణి జయశ్రీ కంభంపాటి కూడా ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా, గవర్నర్ విశ్వవిద్యాలయంలోని అనేక ప్రయోగశాలలను సందర్శించారు.



సీయూటీఎం క్యాంపస్‌లో గవర్నర్ ప్రసంగం

భారీ మొత్తంలో కలప పట్టివేత

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా అటవీ శాఖ వారు కోరుకొండ సమితి ఎంవీ 41 గ్రామానికి చేందిన ధనుర్జయ్ ఢాలీ, పాలకొండ గ్రామానికి చెందిన గంగా మాడీలు కలప తరలిస్తుండగా పట్టుకున్నారు. మల్కన్‌గిరి అటవీ శాఖ రేంజర్ రమేష్ చంద్ర రౌత్ నేతృత్వంలో, సరోజ్ స్వాయి, స్క్వాడ్ సిబ్బంది కూంబింగ్ పనులు మొదలుపెట్టారు. సోమవారం రాత్రి నిందితులు రెండు ట్రాక్టర్లలో లోడ్ చేసిన కర్రలను తరలిస్తున్నారు. అటవీ శాఖ ఆపి తనిఖీ చేయగా సరైన పత్రాలు చూపలేకపోయారు. దీంతో కర్రలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరిచారు.



అటవీ శాఖ స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

51 ఏళ్ల తర్వాత..

జయపురం: జయపురం దేవదాయ ధర్మాదాయ విభాగం ఆధీనంలో గల ఆలయాలకు చెందిన బంగారం, వెండి ఆభరణాల పెట్టెను 51 ఏళ్ల తర్వాత తెరిచారు. 1974 లో రాష్ట్ర దేవదాయ కమిషనర్ ఆదేశం మేరకు దేవాలయాల బంగారు వెండి ఆభరణాలను లెక్కించి ఒక బాక్స్‌లో భద్రంగా ఉంచి ప్రత్యేక ట్రెజరీలో భద్రపరచారు. 51 యేళ్ల అనంతరం నేడు ప్రత్యేక ట్రెజరీలో గల ఆభరణాల పెట్టెను తెరిచారు. రాష్ట్ర దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశం మేరకు కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి సమక్షంలో ఆభరణాల బాక్స్‌ను గట్టి భద్రత మధ్య తెరిచి లెక్కింపు ప్రారంభించారు. జయపురం మహారాజులు తమ సామ్రాజ్యంలో గల దేవ, దేవీల ఆలయాలకు బంగారు, వెండి అలంకార నగలు సమకూర్చారు. 51 ఏళ్ల కిందట లెక్కించి భద్ర పరచిన ఆ నగలను అనాటి లెక్కల ప్రకారం నేడు లెక్కిస్తున్నారు. జయపురం శ్రీజగన్నాథ్ మందిరం పేరుపై ఎలాంటి నగలు లేవని తెలుస్తున్నది. అయితే వల్లభ నారాయణ, నీలకంఠేశ్వర మందిరం, పంచానన మందిరం, దక్షిణ కాళీ మందిరం, మా భగవతీ మందిరాల పేర్లతో నగలు ఉన్నట్లు సమాచారం. అయితే భద్రత దృష్ట్యా దేవాలయాలకు ఎంత పరిమాణంలో బంగారు, వెండి ఆభరణాలు ఉన్నవీ చెప్పలేమని జయపురం దేవాలయ అధికారి, జయపురం అదనపు తహసీల్దార్ చిత్త రంజన్ పట్నాయిక్ వెల్లడించారు. ఈ నగల లెక్కింపులో భువనేశ్వర్ దేవదాయ విభాగం నియమించిన ఆ విభాగ ఇన్‌స్పెక్టర్ సుకాంత పూజారి, జయపురం బీడీఓ శక్తి మహాపాత్రో, జయపురం మున్సిపాలిటీ సహాయ కార్య నిర్వాహక అధికారీ కృతిబాస సాహు, ప్రభుత్వ అధికారి బాలాజీ ప్రసాద్ బ్రహ్మ, జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లాస రంజన్ రవుత్, దేవాదత్త పరిచాలన కమిటీ మాజీ అధ్యక్షుడు నరేంద్ర నాథ్ నాయిక్, లాల్ మోహణ మిశ్రా, రెవెన్యూ అధికారి దిలీప్ ప్రదాన్, దేవదాయ విభాగ ఉద్యోగులు కృష్ణ చంద్రదాస్, సిద్ధేశ్వర దాస్, కాళీ ప్రసాద్ దాస్, శుభం మిశ్ర పాల్గొన్నారు.

లింగరాజు ఆలయంపై డ్రోన్ విహారం

భువనేశ్వర్: ఏకామ్ర క్షేత్రం లింగ రాజు ఆలయ శిఖరంపై డ్రోన్ చక్కర్లు కొట్టిన దృశ్యం స్థానికుల దృష్టికి వచ్చింది. ఈ సమాచారం ప్రసారం కావడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ దేవస్థానంపై డ్రోన్ సంచారం పూర్తిగా నిషేధించినట్లు రాష్ట్ర పోలీస డైరెక్టర్ జనరల్ (డీజీపీ) ఇటీవల ప్రకటించారు. ఆలయ శిఖరంపై డ్రోన్ చక్కర్లు కొట్టే దృశ్యం గమనించిన వెంటనే ఆలయ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది. రాష్ట్రంలో నిషేధిత ఆలయ శిఖరాలపై డ్రోన్‌ల సంచారం తరచు చోటు చేసుకోవడం కలవరపరుస్తోంది. ఈ ఏడాది జనవరి 28న పూరీ శ్రీ జగన్నాథ ఆలయ శిఖరంపై నిషేధిత ప్రాంతాల్లో డ్రోన్ ఎగురుతున్నట్లు గుర్తించారు. శ్రీ మందిరం నీలచక్ర సమీపంలో డ్రోన్ దాదాపు 25 నిమిషాల పాటు చక్కర్లు కొట్టినట్లు స్థానికుల దృష్టికి వచ్చింది. అంతకు ముందు జనవరి 5న ఇటువంటి సంఘటన శ్రీ మందిరం శిఖరాన చోటు చేసుకుంది. తాజాగా స్థానిక లింగరాజు దేవస్థానం శిఖరంపై డ్రోన్ సంచారం రాష్ట్రంలో భద్రతా వ్యవస్థకు పెను సవాలుగా నిలిచింది.



లింగరాజు ఆలయంపై చక్కర్లు కొట్టిన డ్రోన్

మిడ్ డే మీల్ వర్కర్ల ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వర్కర్లు

రాయగడ: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మిడ్ డే మీల్ వర్కర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. జిల్లాలోని గుణుపూర్ పాత బస్టాండ్ నుంచి ర్యాలీగా వచ్చిన వీరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. అనంతరం ఒక వినతిపత్రంను సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోటకు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మిడ్‌డే మీల్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వడం లేదని వారంతా పేర్కొన్నారు. వీరి ఆందోళనకు ఎఐసిసిటియు మద్దతును తెలిపింది. సిపిఐ (ఎంఎల్) జిల్లా అధ్యక్షుడు తిరుపతి గొమాంగో కూడా పాల్గొన్నారు.

రాష్ట్రంలో కోవిడ్ యాక్టివ్ కేసులు లేవు

- ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా

భువనేశ్వర్: దేశంలో కోవిడ్ కేసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రజారోగ్య శాఖ నిఘా ముమ్మరం చేసింది. రాష్ట్రంలో కొత్త జేఎన్ 1 సబ్‌వేరియంట్ దాఖలాలు లేకున్నా ఆరోగ్య శాఖ అధికారులు బహుళ రోగ పీడితులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా మీడియాతో మాట్లాడుతూ కొత్త కరోనా వైరస్ జాతి కొత్త వేరియంట్ కాదని, ఇప్పటికే చెలామణిలో ఉన్న ఓమిక్రాన్ జాతికి ఉప వంశం అని స్పష్టం చేశారు.

మాస్కు ధారణ మంచిదే

పరిస్థితి తీవ్రమైతే కేంద్ర ప్రభుత్వం అధికారిక మార్గదర్శకాలను విడుదల చేస్తుంది. తదనంతరం రాష్ట్ర ప్రజలకు సముచిత సూచనలు జారీ అవుతాయి. గత వ్యాప్తి మాదిరిగానే, మూత్ర పిండాల వ్యాధి లేదా క్యాన్సర్ వంటి సమస్యాత్మక అనారోగ్యాలు ఉన్నవారు తప్పని సరిగా మాస్కులు ధరించాలని ఆయన సూచించారు. తక్షణం భయపడాల్సిన అవసరం లేదని, పాజిటివ్ గుర్తింపు జరిగితే జీనోమ్‌ను సీక్వెన్స్ కోసం నమూనాలను ఉన్నత నిర్ధారణ పరీక్షలకు సిఫారసు చేసి తగిన చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ పేర్కొన్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతుల పరిశుభ్రతను పాటించడం, అనవసరమైన ప్రయాణాలు, సమావేశాలకు దూరంగా ఉండడం శ్రేయోదాయకమని హితవు పలికారు.

జేఎన్.1 లక్షణాలు
గొంతు నొప్పి
ముక్కు కారటం
దగ్గు
అలసట
తేలికపాటి జ్వరం



డాక్టర్ నీలకంఠ మిశ్రా

257 యాక్టివ్ కోవిడ్ -19 కేసులు

ఈ నెల 19 నాటికి మన దేశంలో 257 యాక్టివ్ కోవిడ్ -19 కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికం తేలికపాటివే. ప్రస్తుతానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఎటువంటి కొత్త సలహాలు, మార్గదర్శకాలు జారీ చేయలేదు. సమీప దేశాలలో అంటువ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. ముంబైలో ఇటీవల 2 కోవిడ్ సంబంధిత మరణాలు సంభవించినట్లు సమాచారం. వారిలో మూత్రపిండాల వైఫల్యంతో 14 ఏళ్ల బాలుడు, దీర్ఘకాలంగా 54 ఏళ్ల క్యాన్సర్ పీడితుడు ఉన్నట్లు ఖరారు చేశారు.

న్యూస్‌రీల్

అగ్నిగంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అగ్నిగంగమ్మ

రాయగడ: స్థానిక పిట్టలవీధిలోని అగ్నిగంగమ్మ అమ్మవారి వార్షిక పండుగలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారిని మంగళవారం పసుపుతో అలంకరించారు. సౌభాగ్యాన్ని ప్రసాదించే చల్లనితల్లిగా గుర్తింపు పొందిన అమ్మవారికి ప్రతీ ఏడాది వార్షిక పండుగలో ఈవిధంగా ముస్తాబు చేస్తారు. పట్టు వస్త్రాలతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బుధవారంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

పికప్ వ్యాన్ బోల్తా

- ఇద్దరికి స్వల్పగాయాలు



బోల్తాపడిన వ్యాన్

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి కర్లకోన కూడలిలో పికప్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్, హెల్పర్‌కు స్వల్ప గాయాలు తగిలాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కళ్యాణసింగుపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రాయగడ నుంచి పచారి వస్తువుల లోడుతో కళ్యాణసింగుపూర్ వైపు వెళ్తుండగా వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడినట్లు పోలీసులు పేర్కొన్నారు.


నత్తనడక నిర్మాణాలపై ఎమ్మెల్యే ఆగ్రహం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: నత్తనడక నిర్మాణాలపై నబరంగ్‌పూర్ బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీనగర్, ఇచ్ఛావతి గుడ ప్రజలు ఎమ్మెల్యేను తమ ప్రాంతాలకు మంగళవారం ఆహ్వానించారు. 2023 ఫిబ్రవరిలో ప్రారంభమైన తమ ప్రాంతంలోని రోడ్డు, డ్రైనేజీ పనులు నేటికీ పూర్తవ్వలేదని ఎమ్మెల్యేకు స్థానికులు చూపించారు. పనులు పూర్తికాకపోవడంతో వర్షాకాలంలో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పరిస్థితి పరిశీలించిన ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఇంజినీర్లను పిలిపించారు. తక్షణం నిర్మాణం పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శ్మశాన వాటిక ప్రారంభం



శ్మశానవాటిక శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని ఐఎంఎస్, టి.స్కూల్ సమీపంలో పురపాలక సంస్థ, ఒడిశా సూక్ష్మ పరిశ్రమల నిగమం సంయుక్తంగా నిర్మించిన ఆదర్శ శ్మశాన వాటికను మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి మంగళవారం ప్రారంభించారు. పురపాలక సంస్థ అధ్యక్షుడు మనోజ్ కుమార్ బారిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి అధికారి నరేశ్ చంద్ర శబరో మాట్లాడుతూ.. శ్మశాన వాటికను రూ. 1.50 కోట్లతో నిర్మించినట్టు పేర్కొన్నారు. ఇక్కడ శివుని విగ్రహం, పార్కు, గోదాం, మంచినీటి కోసం బోరును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఉపాధ్యక్షురాలు కవిత మోహంతి, కార్యనిర్వాహక అధికారి కె.అశోక్ చక్రవర్తి, పురపాలక ప్రతినిధి విజయ్ కుమార్ మహారాణా పాల్గొన్నారు.

క్లుప్తంగా

సముద్రంలో వ్యక్తి గల్లంతు


సంతోష్ (ఫైల్)

రణస్థలం : మెంటాడ పంచాయతీ దోనిపేట వద్ద సముద్రంలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. సరదాకు స్నానానికి వెళ్లి ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలం మండలం నారువ గ్రామానికి చెందిన నిద్రబంగి సంతోష్ (31), ఆళ్ల సూర్యనారాయణ, నీలాపు రమణ కలిసి కందివలస గెడ్డలో స్నానానికి వెళ్లారు. అక్కడ నీరు బాగోలేదని సమీపంలోని దోనిపేటలో సముద్ర స్నానానికి దిగారు. కెరటాల ఉధృతికి తొలుత నీలాపు రమణ మునిగిపోతుండగా గమనించిన సూర్యనారాయణ, సంతోష్‌లు కాపాడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో సూర్యనారాయణ, రమణ ఒడ్డుకు చేరుకున్నా సంతోష్ మాత్రం మునిగిపోయాడు. చాలాసేపు వెతికినా సంతోష్ జాడ కానరాకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. జె.ఆర్.పురం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి గాలించినా సంతోష్ ఆచూకీ దొరకలేదు. సంతోష్‌కు భార్య భవాని, ఇద్దరు కుమారులు సిద్దార్థ, హర్షవర్ధన్ ఉన్నారు. పెద్ద కుమారుడు సంతోష్ గల్లంతయ్యాడని తెలిసి తల్లిదండ్రులు రాము, సరస్వతి, భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గల్లంతైన వ్యక్తి గతంలో పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్‌లో కెమిస్ట్‌గా పని చేసి హైదరాబాద్ వెళ్లాడు. మళ్లీ స్థానిక పరిశ్రమల్లోనే ఉద్యోగం సాధిద్దామనే ఉద్దేశంతో నెల రోజుల కిందట గ్రామానికి వచ్చి ఇంటి వద్దనే ఉంటున్నాడు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పునరావాస కాలనీ పనులకు కమిటీలు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్వాసితుల కోసం నౌపడ సమీపంలో తలపెట్టిన పునరావాస కాలనీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో మంగళవారం టెక్కలి ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలనీ పనులు వేగవంతానికి అధికారులతో కమిటీలు వేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా , డ్వామా పీడీ సుధాకర్‌రావు, గృహ నిర్మాణ శాఖ, విద్యుత్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులు పాల్గొన్నారు.

తెలుగు మీడియం రద్దు దుర్మార్గం

శ్రీకాకుళం: రాష్ట్రంలో తెలుగు మీడియం విద్యా బోధన రద్దు చేయటం దుర్మార్గమని రాష్ట్ర ఎడ్యుకేషన్ సబ్ కమిటీ, జన విజ్ఞానవేదిక కన్వీనర్, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని సంస్కరణల పేరిట నాశనం చేస్తోందని, ఇటువంటి చర్యలను ఉపాధ్యాయ సంఘాలు ఉపేక్షించవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తెలుగు మీడియం లేకపోతే ప్రభుత్వ విద్యా రంగం నాశనం అవుతుందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యను బలోపేతం చేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటున్నాయని మండిపడ్డారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు టీచర్లను కేటాయించాలని, ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తిని తగ్గించాలని కోరారు. కూటమి ప్రభుత్వం 9రకాల పాఠశాలలను ఏర్పాటు చేయటం నష్టదాయకమన్నారు. పాఠశాలలను కుదించటం, సెక్షన్లు తగ్గించటం, ఒకే మీడియం అమలు చేయటం, పాఠశాలలు మూసివేయటం కారణంగా వేలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయలకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగాన్ని సంక్షోభంలోని నెట్టేస్తున్న నిర్ణయాలను మానుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఈనెల 21న, రాష్ట్ర స్థాయిలో ఈ నెల 23న చేపట్టనున్న పోరాట కార్యక్రమాలను ఉపాధ్యాయలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న డ్రైవర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పథకంలో పనిచేస్తున్న కెప్టెన్(డ్రైవర్లు)ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, దశరథ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు సైతం సురక్షితంగా తల్లీబిడ్డలను చేర్చుతున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. వాహనాల సంఖ్యను బట్టి అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య,టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, సిబ్బంది కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడు, ఎల్.రాంబాబు, పి.వెంకటరావు, ఎం.మణికంఠ, పి.అనంత్, ఎస్.రాజశేఖర్, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే కాంగ్రెస్ పార్టీని వీడుతా..

- మాజీ ఎంపీ జయరాం పంగి



కొరాపుట్: అవసరమైతే కాంగ్రెస్ పార్టీని విడిచి ప్రజల తరఫున పోరాటం చేస్తానని కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కొరాపుట్‌లో మీడియాతో మాట్లాడారు. ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంత కొఠియా సమస్య పరిష్కారంపై ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. తన సొంత పంచాయతీ సమస్యపై తాను మౌనంగా ఉండడం సరి కాదన్నారు. కాంగ్రెస్‌లో ప్రస్తుతం రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ కమిటీ చైర్మన్‌గా ఉన్నానన్నారు. కొఠియా సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాన్నారు. అది విఫలం అయితే దండకారణ్య పర్వత మాల వికాస్ పరిషత్ పేరిట ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ప్రారంభం అవుతుందన్నారు. దండకారణ్యంలో ఉన్న అవిభక్త కొరాపుట్ జిల్లాలతో పాటు ఆంధ్రాలోని అరుకు ప్రాంతంలోని రెండు జిల్లాలను కలిపి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ప్రారంభిస్తున్నామన్నారు. తమకు రాజకీయ పదవులు కొత్త కాదన్నారు. తన మేనమామ మల్లు శాంత రెండు సార్లు, మేనత్త చంద్రమ శాంత ఒకసారి, తన తండ్రి పంగి మసురు శాంత ఒక సారి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందిన విషయాన్ని జయరాం పంగి గుర్తు చేశారు.

సహదేవ్ పట్నాయక్ మృతి


కాలేజీలో నివాళులర్పిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ప్రభుత్వ కళాశాలలో పనిచేసిన సహదేవ్ పట్నాయక్(61) క్యాన్సర్ వ్యాధితో భువనేశ్వర్‌లో మృతి చెందారు. విషయం తెలియడంతో మాజీ పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మున్నా త్రిపాఠి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి అతని స్వగృహానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కాలేజీలో ప్రత్యేక సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


అడవిలో పడి ఉన్న మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి బోదాపుట్ పంచాయతీ బరువబడి గ్రామ సమీపంలో ఉన్న కిరాడొంగర అడవిలో ఒక గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం అడవికి వెళ్లిన కొంతమంది ఒక గుర్తు తెలియని మృతదేహం చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వెంటాడిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి
- పెంటూరులో విషాదఛాయలు


ఘటనా స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) దొరబాబు(ఫైల్)

నరసన్నపేట: సత్యవరంలో జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వంతెనపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి పిన్నింటి దొరబాబు(38) మృతి చెందారు. శ్రీకాకుళం మండలంలోని ఓ గ్రామంలో అమ్మవారి పండగలకు వెళ్లి స్వగ్రామం నందిగాం మండలం పెంటూరుకు ద్విచక్ర వాహనంపై మామయ్య సనపల సీతారాంతో కలిసి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనా స్థలంలోనే దొరబాబు మృతి చెందగా.. సీతారాంకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు.


మూడు రోజుల్లో విధుల్లోకి..

దొరబాబు అస్సాం రైఫిల్ విభాగంలో పదేళ్లుగా పనిచేస్తున్నారు. బంధువుల కుమార్తె పెళ్లికి వారం రోజులు సెలవుపై వచ్చారు. వివాహ వేడుక రెండు రోజుల కిందటే కాగా, శ్రీకాకుళంలో బంధువుల ఇంట్లో అమ్మవారి పండగలకు వెళ్లారు. మరో మూడు రోజుల్లో తిరిగి విధుల్లో చేరాల్సి ఉంది. ఇంతలో మృత్యువు వెంటాడటంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దొరబాబుకు భార్య కాంచన, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం తెలిసిన వెంటనే నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండల ప్రదర్శనలో కుర్రకారు జోరు


60-65 కేజీల బరువు కేటగిరిలో విజేతలతో నిర్వాహకులు విజయ్‌కుమార్, ప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: కుర్రకారు కండల ప్రదర్శనలు కోలాహలంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో మంగళవారం ఉత్తరాంధ్ర జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలు కన్నులపండువలా సాగుతున్నాయి. అర్ధరాత్రి వరకు కొనసాగిన ఈ శరీర సౌష్టవ పోరులో అండర్- 50 నుంచి 85 కేజీల విభాగం, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పోటీల ప్రదర్శనలో కుర్రకారు జోరు ప్రదర్శించారు. స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు వి.విజయ్‌కుమార్, బి.ప్రసాద్ నేతృత్వంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 80 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. శ్రీకాకుళానికి చెందిన దివ్యాంగ బాడీబిల్డర్ తుపాకుల అనీల్‌కుమార్ విశేషంగా ఆకట్టుకున్నాడు. జాతీయ దివ్యాంగుల బాడీబిల్డింగ్ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన సాయాన్ని అందిస్తామని రిఫరీలు భరోసా ఇచ్చారు.


దివ్యాంగ బాడీబిల్డర్ అనిల్‌కుమార్ ప్రదర్శనలు

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో విద్యార్థులు, క్లబ్‌సభ్యులు

రాయగడ: స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నడకపై చైతన్య ర్యాలీని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కె.సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కొనసాగిన ర్యాలీలో విద్యార్థులు, కాలనీ వాసులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. రోజూ ఉదయం నడవండి సంపూర్ణ ఆరోగ్యం పొందండి అనే నినాదాలతో నిర్వహించిన ర్యాలీలో భాగంగా క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎం. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. రోగాలు దరి చేరకుండా ఉండాలంటే అందుకు ఆరోగ్య సూత్రంలో ప్రధానమైనది నడకేనని అన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించి రోజూ నడవాలని అన్నారు.

'ఎండీయూ వాహనాల రద్దు అన్యాయం'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో బండిలో ఉన్న కంప్యూటర్ కాటా సర్వీస్ ఇంజినీర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఇంజినీర్ బి.అనంతకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినా డ, ఒంగోలు, ఏలూరు తదితర జిల్లాలకు ఎంవిఆర్ టెక్నాలజీ తరఫున నాలుగేళ్లుగా పనిచేస్తున్న తమ బతుకుల్లో నీళ్లు చల్లడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో కుటుంబాలతో రోడ్డున పడతామన్నారు. అధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి మరోమారు ఆలోచన చేయాలని కోరారు.

చిత్తడి నేలల్లో జీవ వైవిధ్యం


ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న పర్యావరణ, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు

సోంపేట: సోంపేట ప్రాంతంలోని చిత్తడినేలల్లో వెలకట్టలేని జీవవైవిధ్యం ఉందని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ యారడి కృష్ణమూర్తి అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా సోంపేట చిత్తడి నేలల జీవవైవిధ్యంపై ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని లోకానాథేశ్వర కళాసీ సంఘ భవనంలో మంగళవారం నిర్వహించారు. అంతరించిపోతున్న పక్షులు, సీతాకోక చిలుకలు, మత్స్య సంపద, వివిధ రకాల పాములు, మత్స్యకారులు, రైతుల జీవన విధానం ఫొటో లు పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడు తూ సోంపేట మండలంలోని చిత్తడి నేలలు మానవాళికి వెలకట్టలేని సంపద అని అన్నారు. ఈ నేలలను రక్షించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు బార్ల సుందరరావు, నాగు, కోదండ, గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సర్వే చేపట్టాలి

నరసన్నపేట: గ్రామాల్లో భూముల రీసర్వేను పక్కాగా చేపట్టాలని సర్వే విభాగం డిప్యూటీ డైరెక్టర్ (విజయవాడ) డీఎల్‌డీఎల్ కుమార్ సూచించారు. మండలంలోని నడగాంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీటీ కృష్ణారావు మాట్లాడుతూ నడగాంలో 1,679 ఎకరాలు ఉన్నాయన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలని, తప్పులు ఉండకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పలస్వామి పాల్గొన్నారు.

కన్నీటి వాన

- జిల్లా కేంద్రంలో నాగావళి నదీ తీరాన పిడుగుపాటు
- ఘటనా స్థలంలోనే తండ్రి మృతి.. కుమారుడికి తీవ్ర గాయాలు
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు


మార్చురీ వద్ద రాజారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామారావు

శ్రీకాకుళం క్రైమ్ : అమ్మవారి ఉత్సవాలతో సందడిగా గడుపుతున్న కుటుంబానికి పిడుగుపాటు తీరని శోకం మిగిల్చింది. జిల్లా కేంద్రంలో నాగావళి నదీ తీరాన మంగళవారం పిడుగు పడడంతో గేదెల రాజారావు (55) మృత్యువాత పడగా.. ఆయన కుమారుడు నాగార్జున తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ధాటికి మరో ఇద్దరు కూడా స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే..

జిల్లా కేంద్రంలోని బలగ బూబమ్మ నగర్‌లో గేదెల రాజారావు తన భార్య, కుమారుడు నాగార్జునతో కలిసి నివసిస్తున్నారు. మంగళవారం భద్రమ్మ తల్లి వారాల సంబరాలుండటంతో ఉదయాన్నే రాజారావు కుటుంబీకులు గొర్రెపోతును చూపించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం గొర్రె పొట్టు మాంసం కడిగేందుకు గుడికి కిలోమీటరు దూరంలో ఉన్న నాగావళి నదీ తీరానికి తండ్రీకొడుకులు వెళ్లారు. వీరికి ఓ రెండు మీటర్ల దూరంలో బుచ్చిపేటకు చెందిన దేశెళ్ల రాజారావు, భైరి రామారావు మరికొందరు కూడా పొట్టు శుభ్రం చేయడానికి వచ్చారు. వీరు పనిలో ఉండగా వర్షం మొదలైంది. సరిగ్గా 7:40 గంటలకు పెను శబ్దంతో పిడుగు పడడంతో రాజారావు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. నాగార్జునకు కూడా తీవ్రంగా గాయాలయ్యాయి. వీరికి సమీపంలో ఉన్న మరో ఇద్దరికి కాలిన గాయాలయ్యాయి. భద్రమ్మ గుడి సిబ్బందికి సైతం పిడుగు శబ్దం వినిపించడంతో స్థానికులతో కలసి ఘటనా స్థలికి వచ్చి చూశారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి క్షతగాత్రులను రిమ్స్‌లో చేర్పించారు. గత 70 ఏళ్లుగా వారాలు జరుగుతున్నా ఏ సందర్భంలోనూ ఇలా ఉదయం పూట వర్షాలు పడలేదని స్థానికులు చెప్పారు. అనంతరం రిమ్స్‌కు చేరిన రెండో పట్టణ ఎస్‌ఐ–2 రామారావు క్షతగాత్రులను, మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించడమే కాక ఘటనాస్థలికి స్థానిక వీఆర్వోతో కలిసి వెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు చెప్పారు. భారీ వర్షాలతో పాటు అత్యధికంగా పిడుగులు పడతాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ గత రెండురోజులుగా హెచ్చరిస్తూనే ఉంది. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాల్లో బయటకు వెళ్లకపోవమే మంచిదని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు ప్రజలను కోరారు.


మృతిచెందిన గేదెల రాజారావు (ఫైల్)

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం

మండలంలోని కలివరంలో సోమవారం పిడుగు పడడంతో కొబ్బరి చెట్టు దగ్ధమైంది. జనని వాసాల నడుమ ఈ పిడుగు పడటంతో జనం భయాందోళన చెందారు. అంతే కాకుండా పలువు రు ఇళ్లకు సంబంధించి ఇంటిగోడలు కూడా చిన్న చిన్నగా బీటలు బారాయి. దీంతో విద్యుత్ అంతరాయం కూడా ఏర్పడింది. గ్రామంలో అనేక మంది ఇళ్లకు సంబంధించి కరెంట్ ఇన్వెర్టర్లు, తదితర విద్యుత్ సామగ్రి కూడా దెబ్బతింది. ఒక్కసారిగా నివాస గృహాల నడుమ పిడుగు పడటంతో గ్రామంలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది.

– ఆమదాలవలస రూరల్


శ్రీకాకుళంలో వాహనదారుల కష్టాలు


భారీ వర్షానికి నీట మునిగిన శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్

అమ్మ పండగలో అపశ్రుతి


పూజలందుకుంటున్న శ్యామలాంబ అమ్మవారు

- రూరల్ సీఐ కార్యాలయ సమీపంలో విరిగిన అంజలి రథచక్రం
- నిరుత్సాహ పడిన భక్తజనం
- ఘనంగా శ్యామలాంబ అమ్మవారి సిరిమానోత్సవం


సిరిమానును చూసేందుకు వచ్చిన భక్త జనం


సిరిమాను అధిరోహించిన పూజారి

సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఉయ్యాల కంబాలు, సోమవారం తొలేళ్ల ఉత్సవం జరగ్గా.. మంగళవారం సిరిమానోత్సవం భక్తజన సంద్రం నడుమ వేడుకగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సిరిమానును తిలకించారు. మొక్కులు చెల్లించుకున్నారు. అయితే మంగళవారం సిరిమానోత్సవం జరుగుతున్న క్రమంలో అపశ్రుతి దొర్లింది.

విరిగిన అమ్మవారి అంజలి రథచక్రం

మంగళవారం సాయంత్రం భక్తజనం నడుమ సిరిమానోత్సవం ప్రారంభమైంది. జన్నివారు సిరిమానును అధిరోహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు జై శ్యామలాంబ అంటూ చేసిన నామస్మరణ నడుమ సిరిమాను నాయుడు వీధి రామమందిరం నుంచి కదిలింది. సాయంత్రం 4.05 గంటలకు సిరిమాను ప్రారంభ ముహూర్తం కాగా కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. సిరిమాను వద్ద కట్టిన తాళ్లు తెగిపోగా వెంటనే వాటిని సరి చేశారు. దీంతో సిరిమాను కదిలింది. కొద్ది సేపటికి బోసు బొమ్మ సమీపంలో రూరల్ సీఐ కార్యాలయం వద్దకు చేరుకోగా అంజలి రథం ఎడమ చక్రం విరిగింది. దీంతో సిరిమానోత్సవం తాత్కాలికంగా ఆగింది. వేరే చక్రం తీసుకువచ్చి ఏర్పాటు చేస్తామని వెల్లడించిన నిర్వాహకులు సుమారు రాత్రి 9 గంటల సమయంలో నూతన చక్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. సిరిమానోత్సవంలో ఏమైనా పొరపాట్లు దొర్లి ఉంటే శ్యామలాంబ తల్లే తమను మన్నించాలని భక్తులు వేడుకున్నారు.


విరిగిన అంజలి రథచక్రం


అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు

అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్, పీవో

శ్యామలాంబ అమ్మవారిని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ పీవో అశుతోష్ శ్రీవాస్తవ అమ్మవారిని దర్శించుకున్నారు. సిరిమాను ఊరేగింపు ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్యామలాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో పట్టణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాటలు, నృత్యాలు, బళ్ల వేషాలు, తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రతి చోట భక్తుల సందడి కనిపించింది.

ఏర్పాట్లపై కలెక్టర్ అసహనం

పట్టణంలో శ్యామలాంబ పండగను భక్తులు తమ స్థాయి కొలది ఘనంగా నిర్వహించుకున్నారు. పండగ ఏర్పాట్లు నేపథ్యంలో అడుగడుగునా ఆంక్షలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పట్టణానికి తరలివచ్చారు. అమ్మవారి ఆలయానికి సుదూర ప్రాంతాల్లోనే పార్కింగ్‌లతో భక్తుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. శ్యామలాంబ ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించలేదు. క్యూలైన్లో ఉండే భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ విరివిగా అందించే ఏర్పాట్లు చేయలేదు. దీన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పండగలో కొరవడిన ఏర్పాట్లపై అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఇద్దరు కానిస్టేబుల్స్ ఏఆర్‌కు అటాచ్..!



ఎస్పీ జారీ చేసిన అటాచ్ మెమో కాపీ

కొత్తవలస: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబ ల్స్‌గా పనిచేస్తున్న జి.రమేష్, డి.దేముడులను ఏఆర్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ వకుల్ జిందల్ ఈ నెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. వారిపై వివిధ రకాల ఆరోపణలు రావడంతో క్రమశిక్ష ణ చర్యల్లో భాగంగా ఏఆర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై స్థానిక సీఐ షణ్ముఖరావును వివరణ కోరగా ఇంకా ఎటు వంటి ఆర్డర్స్ అందలేదని, డిపార్ట్‌మెంట్‌లో ఇలాంటి విషయాలు సహజమని చెప్పారు.

వడదెబ్బతోగొర్రెల కాపరి మృతి



వడదెబ్బతో మృతి చెందిన పోలయ్య

మక్కువ: మండలంలోని కోన గ్రామానికి చెందిన పోలయ్య (42) మంగళ వారం వడదెబ్బతోమృతి చెందినట్లు కుటుంబస భ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పోలయ్య మం గళవారం కోన గ్రామం పక్కనే ఉన్న దబ్బగెడ్డ గ్రామం సమీపంలో గొర్రె లను మేతకోసం తీసుకుని వెళ్లాడు. సాయంత్రం గొర్రెలు ఇంటికి వచ్చినప్పటికీ పోలయ్య రాక పోవడంతో, కుటుంబసభ్యులు వెతకగా పొలాల్లో విగతజీవిగా పడి ఉన్నాడు. వడదె బ్బకు తాళలేక మృతిచెందినట్లు భార్య పార్వతి కన్నీరుమున్నీరైంది. పోలయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోన పంచాయతీ వీఆర్‌ఓ ఈ సమాచారాన్ని తహసీల్దార్ షేక్ ఇబ్రహీంకు అం దించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు రిపోర్ట్ చేసి నట్లు తహసీల్దార్ తెలిపారు.

భార్యను గాయపరిచిన భర్త

పార్వతీపురం రూరల్: కుటుంబ కలహాల కార ణంగా భార్యను భర్త గాయపరిచాడు. పార్వ తీపురం పట్టణంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ కె. మురళీధర్ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తవీధికి చెందిన భార్యభర్తల మధ్య కుటుంబ కలహాల కారణంగా వివాదం తలెత్తడంతో భర్త క్షణికావేశంతో భార్య వీపుపై సమీపంలో ఉన్న దబ్బనంతో పొడిచి గాయపరిచాడని ఈ మేరకు భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గాయపడిన భార్య ప్రస్తుతం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతోందన్నారు.

10 లీటర్ల సారాతో ముగ్గురి ఆరెస్టు

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో 10 లీటర్ల సారాతో ముగ్గురు వ్యక్తులు పట్టుబడడంతో వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.రమశ్రీ తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో సారా విక్రయాలు జరు గుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడు లు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో భీశెట్టి నాగమణి, జోడు పైడితల్లమ్మ, కె.సూర్య నారాయణలు 10 లీటర్ల సారాతో పట్టుబడి నట్లు ఆమె తెలిపారు. వారి దగ్గర గల సారాను స్వాధీనం చేసుకుని వారిని ఆరెస్టు చేసి కొత్తవ లస న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాం డ్ విధించినట్లు ఎస్సై చెప్పారు.

కారులో తరలిస్తున్న సారా పట్టివేత

వీరఘట్టం: కొందరు వ్యక్తులు కారులో గుట్టు గా తరలిస్తున్న సుమారు 160 లీటర్ల సారాను మంగళవారం తెల్లవారుజామున వీరఘట్టం కొత్త బస్టాండ్‌లో ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టు కున్నారు. వీరఘట్టానికి చెందిన ఓ వ్యక్తి కారును కొందరు వ్యక్తులు అద్దెకు తీసుకుని, ఆ కారులో సారా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో కొత్త బస్టాండ్ వద్ద మాటువేసిన ఎక్సైజ్‌శాఖ అధికారులు మంగళవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఆ కారును ఆపి సోదాలు చేయగా 160 లీటర్ల సారా పట్టుబడింది.అయితే కారులో ఉన్న వారు పరారైనట్లు సమాచారం. ఈ విషయం పై పాలకొండ ఎక్సైజ్ సీఐ సూర్యకుమారిని వివరణ కోరగా..కారులో 160 లీటర్ల సారా పట్టుకున్నట్లు తెలిపారు.దీని వెనుక ఎవరెవరు న్నారో దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తర్వాత తెలియజేస్తామన్నారు.

భూసర్వేపై తస్మాత్.

• సర్వే శాఖ డీడీ కుమార్

పూసపాటిరేగ: భూసర్వేపై అప్రమత్తంగా వుం డాలని సర్వే శాఖ డెప్యూటీ డైరెక్టర్ డిఎల్‌బిఎ ల్.కుమార్ అన్నారు. పూసపాటిరేగలో జరు గుతున్న సర్వేను మంగళవారం పరిశీలిం చారు. రోవర్‌తో సర్వే చేసినప్పుడు హద్దులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. బ్లాక్‌ల వారీగా సర్వే జరిగినప్పుడు వీఆర్ వోలు, విలేజ సర్వేయర్ తప్పనిసరిగా ఉండా లన్నారు. పూసపాటిరేగ మండలం గోవింద పురంలో సర్వే పూర్తయిందని మండల సర్వే యర్ గణపతిరావు తెలియజేశారు. పూసపాటి రేగ గ్రామంలో 170 ఎకరాల వరకు సర్వే జరి గినట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ గోవిందను కలిసి సర్వే జరుగుతున్న తీరు, ఏవైనా సమస్యలు వున్నాయా.. మొదలగు అం శాలను అడిగారు. ఆయనతో పాటు ఆర్‌ఎస్ డీటీ కల్యాణి, డీటీ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి ఉన్నారు.

ఆడలి ఘాట్ రోడ్‌లో.. విషాదం

• ద్విచక్రవాహనం లోయలోపడి యువకుడి మృతి
• మరో ఇద్దరికి గాయాలు



మృతుడు వేణుమాధవ్ (ఫైల్)



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో పర్యాటక కేంద్ర మైన ఆడలి వ్యూపాయింట్ ఘాట్‌రోడ్‌లో మంగళ వారం జరిగిన ప్రమాదంలో సీతంపేటకు చెందిన యువకుడు గిరిజాల వేణుమాదవ్ (22) దుర్మ రణం చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆడలి వ్యూపాయింట్ చూడడా నికి వేణుమాధవ్‌తో పాటు కుటుంబ సభ్యులైన చిన్నాన్న కుమారులు గిరిజాల తనీష్ కృష్ణ, వినయ్ ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరుగుప్రయాణంలో వస్తుండగా ఘాట్‌రోడ్డులోని వెల్లంగూడ వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కన ఉన్న లోయలో పడింది. లోయలో పడిన వారిని స్థానికులు పైకి తీశారు. ఐటీడీఏకు సమాచారం ఇవ్వగా ఐటీడీఏ అంబులెన్స్‌లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు శ్రీకాకుళం రిఫర్ చేయ గా కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వేణుమాధవ్ మృతిచెందాడు. మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. మృతుడి తండ్రి శంకర రావు టెక్కలి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తు న్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడం తో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సీతంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై వై.అమ్మ న్నరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామని మృతుడి రెండు కళ్లను ఆస్పత్రికి డొనేట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదాలకు నెలవు వెల్లంగూడ మలుపు

ఆడలి వ్యూపాయింట్ మార్గంలో వెల్లంగూడ మలుపు పలు ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో ప్రమాదాలు ఇక్కడే ఎక్కువగా సంభవిం చాయి. పాలకొండ ఇందిరానగర్ కాలనీకి చెందిన భారతి తన భర్త, పిల్లలతో కలిసి వ్యూపాయింట్‌ను చూసి ఇంటికి తిరిగి వస్తుండగా వెల్లంగూడ మలుపువద్దే ద్విచక్రవాహనం అదుపు తప్పి భారతి అక్కడికక్కడే మృతిచెందింది. భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. జనవరి 16న సంక్రాంతి పం డగ సమయంలో ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లిన రెండు ఆటోలు తిరిగి వస్తుండగా అదుపుతప్పి వెల్లంగూడ లోయలో బోల్తాపడిన ఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. వారిలో కురుంపేటకు చెందిన బొడ్డు యశోదమ్మ, వెల్లంగూడకు చెందిన సవర రెల్లయ్య మృతిచెందారు. తాజాగా వేణుమా ధవ్ మృతి చెందగా మరో ఇద్దరికి గాయాల య్యాయి.

హనుమాన్ జయంతికి సర్వం సిద్ధం



ఉత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పంచముఖ హనుమాన్ ఆలయం కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: వైశాఖ బహుళ దశమి ఈ నెల 22న గురువారం నిర్వహించే హనుమాన్ జయం తికి సర్వం సిద్ధం చేసినట్లు ప్రాజెక్ట్ చైర్మన్ మడిపల్లి వెంకటాచలం పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పం చముఖ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో మంగళవారం ఉత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 4 గంటల నుంచి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష తమలపాకుల తో అర్చనలు ఉంటాయన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జీఎస్.గుప్త మాట్లాడుతూ ఆదేరోజు సాయం త్రం చిన్నారులతో సిందూరార్చన, 27 రకాల పిం డివంటలతో స్వామికి నైవేద్యం సమర్పిస్తామ న్నారు. దేవాలయం కన్వీనర్ పెంటపాటి కామ రాజు మాట్లాడుతూ భక్తులకు మంచినీరు మజ్జిగ, మధ్యాహ్నం 7వేల మందికి అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేశామని తెలిపారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు. కార్య క్రమంలో కలగర్ల నారాయణరావు, రామకృష్ణ, కేవీ. శంకరరావు, నాదం తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్లు, ఏఐ ద్వారా మానవ కార్యకలాపాల గుర్తింపు

• లెండిలో సిల్‌చూర్ నిట్ నిపుణుడు డాక్టర్ బాదల్ సోని



నిట్ ప్రొఫెసర్ బాదల్ సోనిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామారెడ్డి తదితరులు

డెంకాడ: అల్గారిథమ్‌ను ఉపయోగించి మానవ కార్యకలాపాల గుర్తింపు' అనే అంశంపై లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం ఒక రోజు సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా అసోం లోని సిల్‌చూర్ లో గల నిట్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాదల్ సోని హాజరై కార్యక్రమంపై ప్రసంగించారు. 'సె న్సార్ డేటా, స్మార్ట్ లెర్నింగ్ అధునాతన సెన్సార్ టెక్నాలజీలు, మెషీన్ లెర్నింగ్ విధానాల ద్వారా కార్యాచరణ గుర్తింపుపై దృష్టి సారించాలని సూచిం చారు. స్మార్ట్ లెర్నింగ్ అల్గారిథమ్‌తో సెన్సార్ డేటాను సమగ్రపరచడం పెరుగుతున్న ప్రాము ఖ్యతను హైలైట్ చేశారు. ఇంటర్ డిసిప్లినరీ రంగం ఆరోగ్య సంరక్షణ, స్మార్ట్ హోమ్‌లు, భద్రత, మాన వ-కంప్యూటర్ పరస్పర చర్య, మానవ ప్రతిచర్య లపై ఏఐ, నిజంగా తెలివైన వాతావరణాన్ని సృష్టిం చడానికి వీలు కల్పించడం వంటి కీలక రంగాల్లో ఎలా విప్లవాత్మక మార్పులు తెస్తోందో ఆయన వివ రించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ఇటు వంటి ఈవెంట్‌ను నిర్వహించడంలో ఇనిస్టి ట్యూట్ ప్రయత్నాలను ప్రశంసిస్తూ, విద్యార్థులు, పరిశోధకులు ఈ ఆశాజనకమైన టెక్నాలజీ రం గాన్ని అన్వేషించడం, ఆవిష్కరణలు చేయడం ద్వారా చురుగ్గా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్స్ డాక్టర్ వి.అంజి రెడ్డి, డీన్స్‌లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకు లు పాల్గొన్నారు.

చర్చల్లో ప్రతిష్టంభన..!

• ముఖ్యమైన సమస్యల పరిష్కారంపై అస్పష్టత
• నేటి డీఈఓ కార్యాలయం ముట్టడి వాయిదా

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయుల డిమాండ్ల సాధన కోసం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన ఉద్యమ పిలుపు వాయిదా పడింది. రెండు రోజులుగా ఐక్యవేదిక ప్రతినిధులతో ఉన్నతాధి కారులు జరిపిన చర్చలు ఫలించాయని పలు సం ఘాలు మంగళవారం ప్రకటించాయి. ఈ నేపథ్యం లో ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చిన బుధ వారం డీఈఓ కార్యాలయాల ముట్టడిని రద్దు చేశారు. డిమాండ్లలోని కీలక అంశాలపై ఒప్పం దం కుదరకపోవడంతో ఐక్య వేదికలోని పలు సం ఘాల టీచర్లు అసంతృప్తిగా ఉన్నారు. ప్రధానంగా మూడు కీలకమైన డిమాండ్లపై ప్రతిష్టంభన నెల కొంది. ఫౌండేషన్ స్కూల్స్ రద్దు, పాఠశాల పున ర్విభజన అంశాలతోపాటు బదిలీ చట్టంపై సం ఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోకపో వడం వంటి అంశాలపై ఎలాంటి స్పష్టత లేకపో వడం ఉపాధ్యాయుల అసంతృప్తికి కారణంగా నిలుస్తోంది. పాఠశాలల పునర్విభజన పేరుతో తొమ్మిది రకాల స్కూల్స్ నిర్వహణ ఏర్పాట్లను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ చర్చల్లో ఆ అంశం పై ఎలాంటి సమీక్ష లేకపోవడం అసంతృప్తికి మరో కారణమైంది. మిగులు టీచర్ల సర్దుబాటు విధానాల్లో లోపాలను ఎత్తిచూపాయి. కానీ విద్యా శాఖ 'విభజించు-పాలించు' విధానాన్ని అనుస రించి సంఘాల సూచనలను పట్టించుకోలేదని పలువురు టీచర్లు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా న్యాయమైన పోస్టుల కేటాయిం పు వంటి డిమాండ్లు నెరవేరకపోవడంతో ఉపా ధ్యాయులు ఆందోళనలో ఉన్నారు. ఈ వివాదం విద్యావ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాల మధ్య మరింత సమన్వయం, మరిన్ని చర్చల ద్వారా సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉన్నప్పటికీ ప్రభు త్వం అందుకు చొరవ చూపలేదు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాత్రమే బదిలీ ప్రక్రియ మాన్యువల్‌గా చేపట్టి మిగిలిన టీచర్ కేడర్‌లకు ఆన్‌లైన్‌లో నిర్వ హిస్తామని ప్రకటించడం ఉపాధ్యాయుల్లో మరో చర్చనీయాంశమైంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చలు జరపాలని తొలుత డిమాండ్ చేసిన ఐక్యవేదిక అలా జరగకపోయినా ఉద్యమా న్ని వాయిదా వేయడంపై ఉపాధ్యాయ సంఘా లపై టీచర్లు అంతృప్తిగా ఉన్నారు.

మద్యం దుకాణం వద్ద రగడ



మద్యం దుకాణం నిర్వాహకులను ప్రశ్నిస్తున్న కొనుగోలు దారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ మద్యం దుకాణంలో ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యా న్ని అమ్ముతున్నారంటూ పలువురు మద్యం ప్రియు లు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. వల్లూరు గ్రామానికి చెందిన పంచాది శ్రీనివాసరావు, గోవిం ద, తాతినాయుడు, తదితరులు మద్యం కొనేం దుకు షాపుకు వెళ్లగా రూ.660 ఖరీదు గల రెండు బాటిల్స్ మద్యాన్ని రూ.700కు విక్రయించారు. బాటిల్స్‌పై అదనంగా వసూలు చేస్తుండడంతో మరి కొంతమందితో కలిసి షాపు నిర్వాహకులను కొనుగోలుదారులు తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు ఎందుకు అమ్ముతు న్నారని ప్రశ్నిస్తే స్టిక్కర్ మారలేదని షాపులోని వ్యక్తి సమాధానం ఇచ్చాడన్నారు. ఎక్సైజ్ సీఐకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపో యారు. చీప్ లిక్కర్ బాటిల్ నుంచి పెద్ద బ్రాండ్ల వరకు ఇదే దందా కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులైనా స్పందించి బాటిల్‌పై ఉన్న ధరకే మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన పంది నారాయ ణ(25), అదే గ్రామానికి చెందిన ఓ బాలికతో ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. సదరు బాలిక గర్భం దాల్చగా విషయం వెలుగులోకి వచ్చినట్లు ఎస్సై చెప్పారు. పెద్దల సమక్షంలో పంచాయితీ జరగగా, యువకుడు పెళ్లికి నిరాక రించడంతో బాలిక కుటుంబ సభ్యులు ఆ యువకుడిపై ఫిర్యాదు చేశారన్నారు. ఇటీవల బాలికకు అబార్షన్ కూడా జరిగిందని, బాధిత బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ప్రవేశపెడ తామని చెప్పారు. డీఎస్పీ శ్రీనివాసరావు కేసును దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

పీడీ యాక్ట్ కింద వ్యక్తి నిర్బంధం

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సారా నిర్మూలన కార్యక్రమం-న వోదయం 2.0లో భాగంగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు, కొమరాడ మండలం గుమ్మడ గ్రామా నికి చెందిన రాయపల్లి వినోద్ (31) అనే వ్యక్తిని ఎక్సైజ్ జిల్లా అధికారి బి.శ్రీనాథుడు, సిబ్బంది అరెస్టు చేసి, విశాఖపట్నం సెంట్రల్ జైల్లో నిర్బంధించారు. ఈ సందర్భంగా బి.శ్రీనాథుడు మాట్లాడుతూ నిందితుడిపై గతం లో 11 సారా సంబంధిత కేసులు నమోద య్యాయని తెలిపారు. ఈ కేసుల్లో 890 లీటర్ల అక్రమ మద్యం(ఐడీ),7 వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. నిరంతర నేర ప్రవృత్తి, సామాజిక భద్రతకు హానికరమైన చర్యలు ప్రస్తుత నిర్బంధానికి కారణమయ్యా యని చెప్పారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై తీవ్రమైన న్యాయపర చర్యలు తీసుకోనున్నామని స్పష్టం చేశారు.

ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ

• ఈ నెల 23 నుంచి ప్రారంభం

విజయనగరం అర్బన్: ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ ఇచ్చే శిబిరానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నైపు ణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి జి.ప్రశాంతకు మార్ తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్సు శిక్షణ కోసం ఇంటర్, ఐటీఐ, డిప్లమో విద్యార్హత గల 35 సంవత్సరాల వయసున్న స్త్రీ, పురు షులు అర్హులని పేర్కొన్నారు. అదే విధంగా అసి స్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుకు ఐటీఐ ఫిట్టర్, హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు ఐటీఐ ఎల క్ట్రికల్ విద్యార్హతలున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) సంయుక్త నిర్వహ ణలో స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ, బీసీ కాలనీ వీటీఅగ్రహారంలోని న్యాక్ శిక్షణా కేంద్రం స్కిల్ హబ్స్ ప్రాంగణంలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీ నుం చి శిక్షణలు ప్రారంభించే ఈ కోర్సుల కోసం 9652515251, 7075342406 నంబర్లను సం ప్రదించాలని సూచించారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక పరిశీలన

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలం బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ వో జీవనరాణి మంగళవారం ఆకస్మికంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ఓపీ, ఐపీలను పరిశీలించి శత శాతం ఈహెచ్‌ఆర్ ఆబా నంబరుతో ఆన్‌లైన్ చేయా లని సూచించారు. ప్రతీ ఓపీకి అవసరమైన పరీక్షను నిర్వహించాలన్నారు. ల్యాబ్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. హెచ్‌బీ టెస్ట్‌ను మెరుగుపరచాలని సూచించారు. ఐపీ వార్డును పరిశీలించి చిన్న పిల్లల వ్యాక్సిన్‌ను పరిశీలించారు. ఓపెన్ ఓవెల్ పాలసీని అనుసరిస్తు న్నారా... లేదా.. అని వ్యాక్సిన్‌ను పరిశీలించారు. మెడికల్ స్టోర్‌లో బిన్ కార్డ్స్‌ను పరిశీలించారు. విటమిన్ ఏ సిరప్ తగిన మోతాదులో ఉందో.. లేదో పర్యవేక్షించారు. అనంతరం ఆసుపత్రి పరిస రాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని వైద్యా ధికారి ఎం.అనిల్‌కుమార్, సిబ్బందికి సూచించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



ఆలయ ప్రాంతంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మ వారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుం చి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వ హించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాం త్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమ ర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్ర మాలను పర్యవేక్షించారు.

చదురుగుడిలో చండీయాగం

మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆలయ ప్రాంగణంలో మూడో మంగ ళవారాన్ని పురస్కరించుకుని వేదపండితులు వేద మంత్రోచ్ఛారణలతో చండీయాగం ఘనంగా నిర్వ హించారు. ఆలయ వేదపండితులు శంబరి కృష్ణ యాగాన్ని నిర్వహించి, యాగవిశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తు లకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇద్దరి ప్రాణాలు నిలిపిన ప్రభుత్వ వైద్యులు

• కోమా స్థితిలో సర్వజన ఆస్పత్రిలో చేరిన రోగులు



బాలుడు ఈశ్వరావును పరామర్శిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయిడు, డాక్టర్ సుదర్శి, తదితరులు



అప్పారావును పరామర్శిస్తున్న జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ సుదర్శి, డాక్టర్ పద్మలత, డాక్టర్ పద్మావతి

విజయనగరం ఫోర్ట్: ప్రాణాపాయ స్థితిలో ఆస్ప త్రికి వచ్చిన ఇద్దరు రోగుల ప్రాణాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు కాపాడారు. కోమా స్థితిలో ఆస్పత్రిలో చేరిన రోగులు ప్రస్తుతం కోలుకు న్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, జనరల్ మెడిసిన్ విభాగం హెచ్ ఓడీ డాక్టర్ సుదర్శి అందించిన వివరాల ప్రకారం ..పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మం డలం వాడపుట్టి గ్రామానికి చెందిన వెంకట ఈశ్వర రావు అనే బాలుడు సెరిబ్రల్ మలేరియా, న్యుమో నియాతో కోమాస్థితిలో ఈనెల5నప్రభుత్వ సర్వ జన ఆస్పత్రిలో చేరాడు. బాలుడు మూగ, చెవిటి దివ్యాంగుడు. బాలుడిని ఆస్పత్రిలోని జనరల్ మెడి సిన్ విభాగం వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ప్రస్తుతం కోలుకున్నాడు. ఆస్పత్రిలో చేరినప్పుడు ఆహారం కూడా తీసుకోలేకపోయే వాడు. అలాగే బొండపల్లి మండలం మరువాడ గ్రామానికి చెందిన లక్కిడాపు అప్పారావు నెల రోజుల పాటు జ్వరంతో బాధపడడంతో సోడియం లెవెల్స్ తగ్గిపోయి కోమాలోకి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈనెల 5వతేదీన చేర్చారు. ఆ వ్యక్తికి వైద్య పరీక్షలు చేయగా బ్రెయిన్ టీబీ అని తేలింది. ప్రస్తుతం ఆ వ్యక్తి కూడా కోలుకున్నాడు. వారిద్దరికీ జనరల్ మెడి సిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బోళం పద్మావతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మలత, హెచ్‌ఓడీ డాక్టర్ సుదర్శిలు వైద్యం అందించారు.

కదం తొక్కిన కార్మిక సంఘాలు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జిల్లా యూనియన్ కార్యవర్గ నాయకులు, సభ్యులు

• కలెక్టరేట్ వద్ద ధర్నా

విజయనగరం గంటస్తంభం: కార్మికులను బానిస లుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయా లని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం అఖిల భారత కార్మిక సం ఘాల పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఏఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు బెహరా శంక ర్రావు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి మాట్లాడుతూ..లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచన విరమించు కోవాలి. మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి. ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలి. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి. నిరు ద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్మిక, రైతుల వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ ఆపరేషన్ కాగార్ పేరు తో ఆదివాసీలపై దాడులు చేస్తూ అటవీ ప్రాంతం లోని ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు కట్టబెట్టే విధంగా వారికి కొమ్ము కాసేలా వ్యవహరిస్తోంద న్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను నేడు మారుస్తూ కార్మికులకు సంఘం పెట్టుకునే, సమ్మె చేసే హక్కు లేకుండా కట్టు బానిసలుగా చేసే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇటువంటి పరిస్థితుల్లో జూలై 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు టివీ.రమణ, నగర కార్యదర్శి బి.రమ ణ, ఆర్.శంకర్రావు, సుధీర్, శ్రీను, అప్పలరాజు, గిరి ప్రసాద్, బి.గీత, అప్పల సూరి, వెంకటలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష



పోక్సో కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: మూడేళ్ల క్రితం విజయనగరం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ముద్దాయి ఉమామహేశ్వరరావుకు (20) 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2500 జరిమా నా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే..విజయనగ రంలో 9వతరగతి చదువుతున్న బాలిక తో శ్రీకాకుళం జిల్లా గార మండలం దీపా వళి గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు ఇన్ స్టాగామ్‌లో పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తు న్నానని నమ్మించి బాలికను లోబరుచుకుని శ్రీకాకుళం తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై 2023లో సదరు బాలిక తల్లిదండ్రులు విజయనగరం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ లక్ష్మణరావు పోక్సో కేసు నమోదు చేశారు. అలాగే అప్పటి విజయనగరం దిశ మహిళా పోలీస్‌స్టే షన్ సీఐ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ఈ కేసులో నిందితుడు ఉమామహేశ్వరరావుపై చేసిన నేరారోపణలు రుజువు కావడంతో పోక్సో జడ్జి పై విధంగా తీర్పు ఇచ్చినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసులో బాధితురాలికి రూ.2లక్షలు పరిహారంగా ఇప్పించాలని జడ్జి తీర్పు వెల్లడించార న్నారు. పోలీసుల తరఫున పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మెట్ట ఖజానారావు వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ లక్ష్మి, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా కోర్టు సిబ్బందిని, తమ శాఖ సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

కళామతల్లి ముద్దుబిడ్డను ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న హీరోయిన్ దియారాజ్, కేసనకుర్తి శ్రీనివాస్ తదితరులు

విజయనగరం టౌన్: కళలకు కాణాచిగా పేరొందిన విద్యలనగరం విజయనగరం అమ్ములపొది నుంచి జాలువారిన కళామతల్లి ముద్దుబిడ్డ దియారాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఫ్రైడే చిత్ర నిర్మాత కేసనకుర్తి శ్రీనివాస్ కోరారు. శ్రీ గణేష్ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్‌పై నిర్మాణమవుతున్న ఫ్రైడే చిత్రం యూనిట్ మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నున్న జీఎస్‌ఆర్ గ్రాండ్‌లో సందడి చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లాకు చెందిన హీరోయిన్ దియారాజ్‌తో పాటు హీరో, ఇనయ సుల్తానా, రిహానా, వికాస్ వశిష్ట, రోహిత్ బొడ్డపాటిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల అభిమానుల మనసు దోచుకునేలా ఫ్రైడే చిత్రం రూపకల్పన ఈశ్వర్‌బాబు ధూళిపూడి దర్శకత్వంలో తెరకెక్కు తోందన్నారు. హీరోయిన్ దియారాజ్ మాట్లాడుతూ జిల్లావాసులందరూ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. ప్రస్తుతం షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందన్నారు. అనంతరం గురానా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, జనసేన సీనియర్ నాయకుడు గురాన అయ్యలు దియారాజ్‌ను సత్కరించి, అభినందించారు. కార్య క్రమంలో ఆదాడ మోహన్ పాల్గొన్నారు.